## శ్రీ లక్ష్మి గణపతి దేవాలయ 15వ వార్షికోత్సవం

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**
గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో నిర్వహించిన 15వ వార్షికోత్సవ వేడుకల్లో గురువారం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్, ఉప సర్పంచ్ ఎమ్మెల్యేను సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, అల్వాల కోటి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే వివిధ జిల్లాల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు

## 'రామ్ పేరున్నందుకే చట్టానికి వ్యతిరేకమా?



- కాంగ్రెస్ దివాళాకోరుతనానికి నిదర్శనం
- బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**
కూలీల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత భారత్ గ్యారెంటీ విబిజి రామ్ జీ-2025 చట్టాన్ని కేవలం అందులో 'రామ్' అనే పేరున్నందుకే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం ఆ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనమని బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ మండిపడ్డారు. గన్నేరువరం మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకునే ప్రతి మంచి నిర్ణయానికి అడ్డుపడటమే కాంగ్రెస్ అలవాటుగా మారిందని విమర్శించారు. కూలీలకు ఏటా 125 రోజుల పని, 15 రోజుల్లోనే నేరుగా ఖాతాల్లోకి వేతనాల జమ, ఉపాధి హామీ బడ్జెట్‌ను రూ. 1.50 లక్షల కోట్లకు పెంపు వంటి కీలక నిర్ణయాలతో కేంద్రం కూలీలకు అండగా నిలిచిందని తెలిపారు. తెలంగాణకు అదనంగా రూ. 346 కోట్ల నిధులు కేటాయించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో పదేళ్లలో కేవలం రూ. 1.89 లక్షల కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో రూ. 8 లక్షల కోట్లు కేటాయించిందని చెప్పారు. ఉపాధి హామీ చట్టంపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని బీజేపీ కార్యకర్తలు గ్రామగ్రామాన తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండి తిరుపతి, పుల్లెల రామ్, మునుగంటి సత్తయ్య, కాంతల రాజిరెడ్డి, మాడుగుల రామకృష్ణారెడ్డి, గూడూరి జగన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు



- కండువా కప్పి ఆహ్వానించిన గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి
- మున్సిపాలిటీలోని మూడు డివిజన్ల నుంచి వలసలు

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**
శెనార్తి మీడియా, మంచిర్యాల:
మంచిర్యాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. పలు డివిజన్లకు చెందిన ముఖ్య నాయకులు గురువారం కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. 52వ డివిజన్ నాయకులు కోటగిరి రవి (సురభి) స్వాతి, 56వ డివిజన్ సీనియర్ నాయకులు వెంగళ కొమురయ్య, 23వ డివిజన్ నాయకులు రౌతు వెంకటేష్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

**పార్టీ బలోపేతమే లక్ష్యం**
బీజేపీ జాతీయ నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వంగపల్లి వెంకటేశ్వర్ రావు, గాజుల ముఖేష్‌గౌడ్, అమిరిశెట్టి రాజ్ కుమార్, చిట్టినేని హనుమంత్ రావు, బింగి ప్రవీణ్, బోయిని దేవేందర్, గాజుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గద్దెపైకి సమ్మక్క ఆగమనం



- మంచిర్యాలలో కన్నుల పండుగగా వనదేవతల జాతర
- అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దంపతులు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**
మంచిర్యాల గోదావరి తీరంలోని గౌతమేశ్వర ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రమైంది. మేడారం జాతరను తలపిస్తూ వనదేవత సమ్మక్క తల్లిని ఊరేగింపుగా గద్దెపైకి చేర్చారు. ఈ ఆధ్యాత్మిక ఘట్టం భక్తుల కోలాహలం, పూనకాల మధ్య కన్నుల పండుగగా సాగింది. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

**మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే**
వనదేవతలు సమ్మక్కసారలమ్మలను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, సురేఖ దంపతులు దర్శించుకున్నారు. తల్లుల ఆశీస్సులతో మంచిర్యాల నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వారు కోరుకున్నారు. జాతర కోసం విస్తృత ఏర్పాట్లు చేసిన మున్సిపల్, పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కారు వైపు కామ్రేడ్ల అడుగులు

- రాష్ట్రంలో హస్తంతో దోస్తీ.. మంచిర్యాల జిల్లాలో 'గులాబీ'తో మంతనాలు
- సింగరేణి ప్రాంతంలో కుదరని కాంగ్రెస్–వామపక్ష సయోధ్య
- ఉనికి కోసం పొత్తులు తెంచుకుంటున్న కమ్యూనిస్టులు
- మున్సిపల్ ఎన్నికల వేళ వేడెక్కుతున్న రాజకీయ సమీకరణాలు
- బీఆర్ఎస్ చెంతకు సీపీఐ..?
- సీట్ల పంపకాలు కొలిక్కి వచ్చినట్లేనా?




**శెనార్తి మీడియా, శంకరపట్నం:**
మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో మంచిర్యాల జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ముఖ్యంగా మంచిర్యాల కార్పొరేషన్, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్-సీపీఐ పొత్తు కుదరబోతుందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మారుతున్న సమీకరణాలు స్థానిక నేతలతో పాటు కార్యకర్తల్లోనూ ఉత్కంఠను పెంచుతున్నాయి. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన వామపక్షాలు, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి అదే పార్టీతో దూరమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల విషయంలో సయోధ్య కుదరకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. మంచిర్యాల నియోజకవర్గంలో సీపీఐకి కేవలం రెండు సీట్లకే పరిమితం చేస్తామని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ పరిణామంతో అసంతృప్తికి లోనైన కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయ రాజకీయ దారులపై దృష్టి పెట్టినట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

**మాజీ ఎమ్మెల్యేతో రహస్య మంతనాలా..?**
కాంగ్రెస్ తీరుపై అసహనంతో ఉన్న సీపీఐ నేతలు బీఆర్ఎస్ కీలక నేతలతో సంప్రదింపులు జరిపినట్లు ప్రచారం సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, రాష్ట్ర స్థాయి నాయకుడు నడిపెల్లి విజిత్ రావులతో చర్చలు జరిగాయన్న వార్తలు రాజకీయ వర్గాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. మంచిర్యాల కార్పొరేషన్‌లో కనీసం ఆరు సీట్ల కోసం ఈ మంతనాలు సాగుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు తీవ్ర రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు ఇప్పుడు ఎన్నికల అవసరాల కోసం దగ్గరవడం ఆసక్తికరంగా మారింది.మంచిర్యాల కార్పొరేషన్‌లో 4 నుంచి 6 సీట్లు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 6 సీట్లు కేటాయించాలంటూ బీఆర్ఎస్ ముఖ్య నేతలకు సీపీఐ ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. అయితే బెల్లంపల్లి మున్సిపాలిటీలో సీట్ల పంపకాల విషయంలో ఇంకా స్పష్టత రాలేదని తెలుస్తోంది. గురువారం సాయంత్రం వరకు చర్చలు తుది దశకు చేరతాయన్న టాక్ బలంగా వినిపిస్తోంది.

**హ్యాండిచ్చిన హస్తం.. కనికరిస్తున్న కారు**
గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వెంట నడిచిన సీపీఐ నాయకులు, ఇప్పుడు తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడమే లక్ష్యంగా మున్సిపల్ ఎన్నికలను కీలకంగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే అధికార కాంగ్రెస్ మాత్రం కమ్యూనిస్టుల ప్రతిపాదనలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం నామినేషన్ల గడువు ముగియనుండటంతో, తమ భవిష్యత్తుపై తక్షణ నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితిలో వామపక్షాలు ఉన్నట్లు సమాచారం.
ప్రస్తుత పొత్తు కేవలం మున్సిపల్ ఎన్నికల వరకే పరిమితమవుతుందా..? పరిషత్ ఎన్నికల నాటికి ఇదే సమీకరణ కొనసాగుతుందా..? అన్న ప్రశ్నలకు ఇప్పుడే సమాధానం చెప్పలేమంటున్నారు గులాబీ పార్టీ నేతలు. కానీ మంచిర్యాల రాజకీయాల్లో మాత్రం మార్పు ఖాయం అన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

## కన్నుల పండుగగా మత్స్యగిరీంద్రుడి కల్యాణం



- కన్నుల పండుగగా మత్స్యగిరీంద్రుడి కల్యాణం
- శాస్త్రోక్తంగా వేడుకలు.. పట్టు వస్త్రాల సమర్పణ.. మంత్రి హాజరు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**
శంకరపట్నం మండలం కొత్తగట్టులోని మత్స్యగిరీంద్ర స్వామి కల్యాణ వేడుకలు గురువారం నేత్రపర్వంగా సాగాయి. లీలాదేవి, భూదేవి సమేత మత్స్యగిరీంద్రుడికి వేద పండితులు శాస్త్రోక్తంగా వివాహ వేడుకలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

**ప్రభుత్వ పరంగా పట్టు వస్త్రాల సమర్పణ**
కల్యాణోత్సవంలో భాగంగా ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వీణవంక మండలం బేతికల్ గ్రామానికి చెందిన విడపు వంశస్థులు స్వామివారికి పుస్తె, మట్టెలు అందజేశారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

**మంత్రి పూజలు.. వేద మంత్రోచ్ఛారణ**
ఈ వేడుకలకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అర్చకులు శేష మురళీధరాచార్యులు, యజ్ఞాచార్యులు, రామకృష్ణాచార్యులు వేదయుక్తంగా కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, బాలయ్య చైర్మన్ కోరెం రాజిరెడ్డి, జెడ్పీటీసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, గోపగోని బసవయ్య, గట్టు తిరుపతి మాజీ చైర్మన్ ఉప్పగళ్ల మల్లారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, భక్తులు పాల్గొన్నారు.

## ఐదు రోజుల్లోగా స్కాలర్‌షిప్‌ల నమోదు పూర్తి చేయాలి

- ఎస్సీ విద్యార్థుల వివరాలపై అదనపు కలెక్టర్ సమీక్ష
- 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.3,500 నగదు జమ

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**
జిల్లాలోని 5 నుంచి 10వ తరగతి ఎస్సీ విద్యార్థుల ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల నమోదు ప్రక్రియను ఐదు రోజుల్లోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య ఆదేశించారు. గురువారం నస్పూర్ కలెక్టరేట్‌లో విద్యా, బ్యాంకు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాజీవ్ విద్యా దీవెన ద్వారా 9, 10 తరగతుల వారికి రూ.3,500, ప్రభుత్వ పాఠశాలల్లోని 58 తరగతుల బాలికలకు రూ.1,500, బాలురకు రూ.1,000 చొప్పున ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతా వివరాలను ఈపాస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. ధ్రువీకరణ పత్రాల జారీలో తహసీల్దార్లు, ఖాతాల ప్రారంభంలో బ్యాంకు అధికారులు వేగంగా వ్యవహరించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల నివేదికలను సిద్ధం చేసి ఎంఈఓలకు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఓ యాదయ్య, ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీ దుర్గాప్రసాద్, ఎల్‌బీఎం తిరుపతి పాల్గొన్నారు.

## మంచిర్యాలలో కాంగ్రెస్‌కు షాక్..



- బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు
- దివాకర్ రావు సమక్షంలో గులాబీ గూటికి కీలక నాయకులు
- హామీల అమలులో ప్రభుత్వం వైఫల్యంపై ఆగ్రహం
- మేయర్ పీఠం కైవసమే లక్ష్యంగా కండువా కప్పిన నడిపెల్లి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**
మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అధికార పార్టీ తీరుపై అసంతృప్తితో మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్లకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హాజీపూర్ మండలం నంనూర్ మాజీ ఎంపీటీసీ వడ్డే బాలరాజు, గుడిపేట నాయకుడు చెల్లా రమేష్, వారి అనుచరులతో పాటు 17, 18 డివిజన్ల నాయకులు పార్టీలో చేరారు. అలాగే 58వ డివిజన్ నుంచి అప్పసు శిరీష్‌శ్రీకాంత్, 7వ డివిజన్ మాజీ కౌన్సిలర్ పూదరి కుమార్, 29వ డివిజన్ (సంఘ మల్లయ్యపల్లి) నుంచి గండ్రా అమర్ రావు ఆధ్వర్యంలో పలువురు యువకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా చేరిన నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఆరు గ్యారంటీలు, 420 హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. జిల్లాలో కాంగ్రెస్ నాయకుల అరాచకాలు, బెదిరింపులు, సెటిల్‌మెంట్లు పెరిగిపోయాయని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలు, నియంతృత్వ ధోరణికి నిరసనగా తాము పార్టీ వీడుతున్నట్లు ప్రకటించారు. కేసీఆర్ నాయకత్వం, దివాకర్ రావు అభివృద్ధిని చూసి మళ్లీ బీఆర్ఎస్‌లోకి వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మొగిలి శ్రీనివాస్, అక్కూరి సుబ్బన్న, మెరుగు పవన్, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, మల్లెత్తుల రాజేంద్రపాణి, జక్కుల రాజేశం, రమణా రెడ్డి పాల్గొన్నారు



## సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి



- జీజీహెచ్ ఎదుట పారా మెడికల్ జేఏసీ నిరసన
- ఆస్పత్రి వద్ద పోలీస్ బందోబస్తుకు డిమాండ్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**
జిల్లా ప్రధాన ఆస్పత్రి (జీజీహెచ్) క్యాజువాలిటీ విభాగంలో సెక్యూరిటీ సిబ్బందిపై జరిగిన దాడిని పారా మెడికల్ జేఏసీ తీవ్రంగా ఖండించింది. విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు నాందేవ్, ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. బుధవారం రోగుల బంధువులు సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేయడం అమానుషమని మండిపడ్డారు. వెంటనే నిందితులను అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలని, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలని వారు కోరారు. ఆస్పత్రి ప్రాంగణంలో నిరంతరం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారా మెడికల్ జేఏసీ ప్రధాన సలహాదారు ఆల్లాడి శ్రీనివాస్, కోశాధికారి శంకర్, మహిళా కార్యదర్శి పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ భద్రతా వలయంలో సమ్మక్క జాతర

- కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర నిఘా
- వెయ్యి మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**
గోదావరి తీరంలో జరుగుతున్న సమ్మక్క జాతర కోసం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తుల రక్షణే ధ్యేయంగా జాతర ప్రాంగణం మొత్తాన్ని నిఘా నీడలోకి తీసుకొచ్చారు. 500 మీటర్ల దూరం వరకు చిత్రాలను బంధించే సామర్థ్యం ఉన్న 20 అధునాతన కెమెరాలను మైదానమంతటా అమర్చారు. వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, ఒక సీఐ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించారు. వెయ్యి మంది పోలీస్ సిబ్బందితో పాటు బందోబస్తులో విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేశారు. మిమ్స్, సీవీ రామన్ కళాశాలలకు చెందిన వంద మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భక్తులకు సేవలందిస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ప్రాంతాన్ని 24 గంటల పాటు పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



## సమ్మక్కకు ఎత్తు బంగారం సమర్పించిన పొన్నం

**శెనార్తి మీడియా, కేశవపట్నం:** కేశవపట్నంలో ఘనంగా నిర్వహిస్తున్న సమ్మక్క సారక్క జాతరలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని వనదేవతలైన సమ్మక్క సారక్కలకు ఎత్తు బంగారాన్ని సమర్పించారు. సంప్రదాయ ఆచారాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, జాతరను విజయవంతంగా జరపాలని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

